
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

కర్నూలు

జిల్లా వార్తలు


శనివారం 2 మార్చి 2024





దేవతలారా రండి

- శ్రీగిరిపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా ధ్వజారోహణ
- శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ
- నేడు స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ



ఉత్సవాలను సూచిస్తూ ధ్వజారోహణం

శ్రీశైలం, మార్చి 1: శ్రీశైలం క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం యాగశాల ప్రవేశంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11న ముగియనున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆగమ శాస్త్రానుసారం బ్రహ్మోత్సవ ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు చతుర్వేదపారాయణాలు చేసి వేద స్వస్తి నిర్వహించారు. వేద స్వస్తి తరువాత దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కళ్యాణ సంకల్పాన్ని పఠించారు. దీనినే శివ సంకల్పం అంటారు. అనంతరం ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజను చేశారు. ఈ బ్రహ్మోత్సవాల సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివ పరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో జరుగుతున్నందున చండీశ్వరునికి ప్రతేకంగా పూజాదికాలు జరిపారు. కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించి వాటిని అర్చకులు, అధికారులు ధరించారు. అనంతరం రుత్విగ్వరణం నిర్వహించి, అఖండ దీపస్థాపన, వాస్తు పూజ, వాస్తు హోమం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వాహధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు విరూపాక్షయ్య స్వామి, విజయలక్ష్మి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు శుక్రవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి దేవస్థానం పట్టువస్త్రాలను సమర్పించింది. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం తరపున ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్‌వీ నాగేశ్వరరావు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ ఈవో డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులకు స్వాగతం పలికారు. తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ అన్నారు.



శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు



నేడు భృంగి వాహన సేవ

బ్రహ్మోత్సవాల రెండో రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు మొదలవుతాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భృంగి వాహన సేవ నిర్వహిస్తారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. శుక్రవారం సాయంత్రం సంప్రదాయ నృత్యం, భక్తి రంజని, శివలీలలు, వీణానాదం, పార్వతీ కల్యాణం, రామాంజనేయ యుద్ధం కార్యక్రమాలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల మొదటి రోజు ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకముందు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతావిష్కరణ చేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త వస్త్రం మీద పరమశివుని వాహనమైన నందీశుని చిత్రీకరిస్తారు. దీనికే ధ్వజపటం అని పేరు. తరువాత ధ్వజపటానికి చండీశ్వరుని సమక్షంలో ప్రత్యేక పూజాదికాలు, భేరీ పూజ నిర్వహిస్తారు. ఈ భేరీ పూజలో డోలు వాయిద్యానికి పూజాదికాలు చేసి తరువాత నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో ఆయా దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. చివరగా ధ్వజస్తంభంపై ఎగరవేస్తారు. ధ్వజస్తంభం మీద ఎగిరే ఈ నంది పతాకమే సకల దేవతలు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానమని, బ్రహ్మోత్సవాల సమయంలో దేవతలంతా క్షేత్రంలోనే ఉంటూ ఉత్సవాన్ని తిలకిస్తారని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి.



యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈఓ పెద్దిరాజు

ఎన్నికల హడావుడి..!

- పరిహారం చెల్లించకుండానే బైపాస్ పనులు
- పాత అలైన్మెంట్, మాస్టర్ ప్లాన్ తుంగలోకి..
- రోడ్డున పడుతున్న 800 పేద కుటుంబాలు



ఆదోని రింగ్ రోడ్డు నిర్మాణ ప్లాను



బైపాస్ కోసం రోడ్డు చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 1: నాలుగన్నరేళ్ల బైపాస్ నిర్మాణాన్ని చేపట్టకుండా రేపోమాపో ఎన్నికలు వస్తున్నాయని అధికార పార్టీ ఎమ్మెల్యే హడావుడిగా పనులను ప్రారంభించారు. బాధితులకు పరిహారం చెల్లించకుండా పాత అలైన్మెంట్, బ్రిటీష్ కాలం నాటి మాస్టర్ ప్లాన్ అమలు చేయకుండా తమ అధికార పార్టీ అస్మదీయుల కోసం కొత్త అలైన్మెంట్‌ను అమలులోకి తెచ్చారు. దీంతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం రెండో ముంబైగా పేరుగాంచింది. మూడు లక్షల పైగా జనాభా. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో అతి పురాతనమైన రెండవ పురపాలక సంఘం, ప్రతి రోజూ 20-25 వేలకు పైగా వాహన రాకపోకలు సాగుతుంటాయి. పురపాలకు సంఘం ఏర్పడి 156 ఏళ్లయినా, ఇరుకైన రహదారులే. రోడ్ల విస్తరణ జరగకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యే. నాటి ప్రభుత్వం ప్రజల అవసరాల దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ కోసం పట్టణ శివారు ప్రాంతం ఎమ్మిగనూరు రహదారి నుంచి ఆస్పరి రోడ్డు వరకు 2.1కి.మీ. గతంలో పూర్తి చేశారు. ఆస్పరి రహదారి నుంచి ఆలూరు రహదారి వరకు 3.4 కి.మీ. నిర్మాణాన్ని పెండింగ్ పెట్టి జాప్యం చేశారు. పాత అలైన్మెంట్ కాదని ఎక్కడైతే బాపాస్ మొదలైందో.. 800 మీటర్ల దూరంలోనే నెట్టేకలు క్రాస్ నుంచి ఆస్పరి బైపాస్ మీదుగా ఆలూరు బైపాస్ వరకు 7.4కి.మీ. నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి అలైన్మెంట్ మార్చి ప్రతిపాదించారు. ఇందుకు భూసేకరణ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే రూ.240 కోట్లను 2021 బడ్జెట్లో కేటాయించింది. పాత అలైన్మెంట్ మార్చడం వల్ల ఎనిమిది వందల మంది పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



బైపాస్ నిర్మాణంతో కోల్పోతున్న ఇల్లు

అంతా దోపిడే..

- అక్రమ కేసులతో బుగ్గన బెదిరిస్తున్నాడు
- ప్రజల భవిష్యత్తు కోసమే డోన్ నుంచి పోటీ
- కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 1: డోన్ నియోజకవర్గంలో మైనింగ్, లిక్కర్, ల్యాండ్, ఇసుక మాఫియాలతో అంతా దోపిడీ చేస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని మధు ఫంక్షన్ హాలులో నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి ఆత్మీయ సభలో కోట్ల మాట్లాడారు. తాను కర్నూలు ఎంపీగా మూడు సార్లు, రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఒకసారి పని చేశానన్నారు. డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన అరాచకాలతో ఇబ్బందులు పడుతున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉండాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. మైనింగ్ వనరులు ఎక్కువగా ఉన్నాయని.. పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బావిపల్లి సర్పంచ్ లింగన్నను టార్గెట్ చేసి వైసీపీలోకి రావాలని, అక్రమ కేసులను బయటకు తీస్తున్నారని, అలాంటి వాటికి ఎవరూ భయపడవద్దని భరోసా ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, గౌరు చరితారెడ్డి, మీనాక్షి నాయుడు, పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, కోట్ల రాఘవేంద్రరెడ్డి, కోట్ల నివేదిక, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, చంద్రపలి ఆచారి పాల్గొన్నారు.



డోన్‌లో జరిగిన టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో కేఈ బ్రదర్స్, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి గజమాలతో సత్కారం

రేపు టీడీపీ దళిత సింహ గర్జన: బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), మార్చి 1: ఈ నెల 3న తెలుగుదేశం పార్టీ తలపెట్టిన దళిత సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 11 గంటలకు నగరంలోని ఎమ్మార్పీ ఫంక్షన్ హాలులో నిర్వహించే కార్యక్రమానికి నంద్యాల, కర్నూలు జిల్లాల తెలుగుదేశం పార్టీ నాయకులు, అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిలు, దళితులు, కార్యకర్తలు, తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 1: ఓటర్ల జాబితా పోలింగ్ స్టేషన్‌లలో సదుపాయాలు తదితర అంశాలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ జి.సృజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల పేరు మార్పు, లోకేషన్ మార్పు తదితర అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు నేడు సీఈవోకు పంపనున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన టీములను ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చామని అన్నారు. నోటిఫికేషన్ వచ్చిన మూడు రోజులకు పోలింగ్ స్టేషన్లలో వల్నరబిలిటీ మ్యాపింగ్ ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. డీఆర్వో మధుసూదన్‌రావు, బీజేపీ పార్టీ ప్రతినిధి సాయిప్రదీప్, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జాన్‌విల్సన్, టీడీపీ ప్రతినిధి రాజు, బీఎస్‌పీ పార్టీ ప్రతినిధి అరుణ్ కుమార్, సీపీఎం ప్రతినిధి రాజశేఖర్, ఎన్నికల విభాగాల సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నాం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర సీఈవోకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన వివరించారు. శుక్రవారం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఓటరు చేర్పులు, మార్పులు, తొలగింపుల దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని సీఈవోకు కలెక్టర్ వివరించారు. ఎపిక్ కార్డులను మార్చి 10వ తేదీలోపు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ఎండ వేడికి తోడు ఉక్కపోత
- ఫ్యాన్లు తిరగక ఉక్కిరి బిక్కిరైన విద్యార్థులు
- మొదటి రోజు 714 మంది గైర్హాజరు







కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి1: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఉదయం 8 గంటలకే తల్లిదండ్రులు, బంధువులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణాల్లో ఉన్న పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు పరిస్థితి కొంత మెరుగుగా ఉన్నా, గ్రామీణ ప్రాంతాలలోని పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఎండ వేడికి తోడు పరీక్ష కేంద్రాలలోని గదుల్లో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో ఊపిరాడక విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపకపోవడంతో విద్యార్థులు ఆటోల్లో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల కళాశాలలోని వరండాల్లో కూడా విద్యార్థులను కూర్చోబెట్టి పరీక్షలు రాయించారు. కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 23,120 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25,173 ఉన్నారు. మొత్తం 47,412 మంది. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,406 పరీక్షలకు హాజరుకాగా 714 గైర్హాజరయ్యారు. ఒక్క మాల్ ప్రాక్టీసు కేసు కూడ నమోదు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగాయి. పరీక్ష కేంద్రాలను కన్వీనర్ ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి, డీవీఈఓ జమీర్ పాషా, డీఈసీ సభ్యులు పరమేశ్వర రెడ్డి, జి. లాలెప్ప, ప్రభుచరణ్, సిట్టింగ్, స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సూపర్ సిక్స్ పథకాలు గెలుపునకు సోపానాలు


బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 1: టీడీపీ అధినేత నారా చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు టీడీపీ విజయానికి సోపానాలని టీడీపీ కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈసందర్భంగా దస్తగిరిని టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె కృష్ణ, జె సురేష్, గోపాల్ రెడ్డి, నగర పంచాయతీ మాజీ వైస్‌చైర్మన్ రామాంజనేయులు, రేమట వెంకటేష్, పౌలు, కౌన్సిలర్లు బుడ్డంగలి, షాషావలి, పౌలు, విజయ్ కుమార్, కెఎం రవి, పత్తి రవి, బ్రహ్మయ్య, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, మార్చి 1: టీడీపీ, జనసేన రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఓర్వకల్లులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ రాబోవు ఎన్నికల్లో అందరూ సైనికుల్లా పని చేసి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై అక్రమంగా రౌడీషీట్ ఓపెన్ చేయడం సరికాదన్నారు. రాజకీయ కక్షతోనే రాజశేఖర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అబ్దుల్లా, నాగరాజు, అల్లాబాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 1: ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ విజయవాడ అధ్వర్యం లో మార్చి 1 వరకు జరిగే వర్క్‌షాపులో గ్రామ పంచాయతీల్లో వస్తువుల కొనుగోలు, వ్యాలిడిటీ తదితర ముఖ్యమైన అంశాలపై సర్పంచులు, కార్యదర్శు లకు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి వర్క్‌షాపు ప్రారంభించారు. బీఐఎస్ కేర్ యాప్ ద్వారా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ రీసోర్స్ పర్సన్ సాయి కౌశిక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, జూని యర్ అసిస్టెంట్ రాజావిష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెండ్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 1: జిల్లాలోని కౌతాళం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ-ఇంగ్లీషు) ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వీ.భీమన్నను సస్పెండ్ చేసినట్లు డీఈవో సామ్యుయేల్ శుక్రవారం తెలిపారు. భీమన్న విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరో పణలపై సస్పెండ్ చేసినట్లు డీఈవో వివరించారు. మళ్లీ ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని, అప్పటి వరకు ఆయన రావాల్సిన ఆర్థిక లావాదేవిలన్నీ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అనుమతి లేని ల్యాబ్‌లను సీజ్ చేయాలి

కర్నూలు(హస్పిటల్), మార్చి 1: అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డీఎంహెచ్‌వో ఏవో అరుణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఎదుట ఉన్న కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లు, డయో గ్నోస్టిక్ సెంటర్లు ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. ఏడు జిల్లాల నుంచి కర్నూలు జీజీహెచ్‌కు పేద రోగులు వస్తుంటారని, వీరి అమా యకత్వాన్ని ఆసరాగా తీసుకుని కొన్ని ప్రైవేటు ల్యాబ్‌ల సిబ్బంది బయటకు పబ్లిక్‌గా తీసుకెళ్తున్నారని, దీన్ని ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అరికట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డయోగ్నస్టిక్ సెంటర్లను నిర్వహిస్తున్న యజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో ఏవో అరుణకు వినతి పత్రం అందజేశారు.

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, మార్చి 1: ఓర్వకల్లులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2014-15 విద్యాసంవత్సరానికి గానూ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జోషిలా వాట్స్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 21న ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ రూ.75లు ప్రవేశ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. బీసీ, ఓసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థు లకు కనీసం 30 మార్కులు పొందాలన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమో దు చేసిన ఫారం జిరాక్స్ కాపీని ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో అందజేయాలని ఆమె కోరారు.

నేడు సీపీఐ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 1: భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని దేవి ఫంక్షన్ హాలులో జరిగే ఈ సమావేశానికి జాతీయ కార్యదర్శి కే.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు, మార్చి 1: విద్యుత్ మీటర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ కార్యాలయంలో ఎస్‌ఏఓ చిన్నరాఘవులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల మీటర్ రీడర్స్ అధ్యక్షులు రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, మార్చి 1: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలె త్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసెనాయక్ సర్పంచులకు ఆదేశించారు. శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. తుంగభద్ర నదిలో నీరు పూర్తిగా ఇంకిపోవడంతో నదితీరా గ్రామాలకు తాగునీటి ఏర్పడుతుందని అన్నారు. వేసవి ముగిసే వరకు కొత్త కొళాయి కనెక్షన్లు ఇవ్వరాదన్నారు.

టీజీ భరత్‌పై తప్పుడు ప్రచారాలు

» ఎన్నికలవేళ అసత్య ఆరోపణలు తగవు
» దళిత జేఏసీ నాయకులు


ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్షలో దళిత జేఏసీ నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 1: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్‌పై కొందరు ప్రతి పక్షాల నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దళిత జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని ధర్నా చౌక్ వద్ద దళిత జేఏసీ ఆధ్వర్యంలో నేతలు నిరసనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకులు దేవా, గున్నామార్కు తదితరులు మాట్లాడుతూ టీజీ కుటుంబం ఎంతోమందికి అండగా నిలిచిందన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి కుటుంబంపై కొందరు ప్రతిపక్షాలు కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కర్నూలు మండలం మామిదాల పాడు గ్రామంలోని 231/1సీ సర్వే నెంబర్‌లో 33 సెంట్ల స్థలం టీజీ భరత్‌కు చెందినదన్నారు. ఈ స్థలంపై కొందరు కాసులకు కక్కుర్తి పడి టీజీ భరత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. టీజీ భరత్‌కు ఇతరుల ఆస్తులు అక్రమంగా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. టీజీ భరత్ ఈ స్థలాన్ని 30 సంవత్సరాల క్రితం కొన్నారని రిజిస్ట్రేషన్ పూర్తయి కూడా 30 ఏళ్లు గడిచిందన్నారు. ఇప్పుడు వచ్చి అసత్య ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆ స్థలంపై ఎవరు కోర్టుకు వెళ్లినా కూడా అందుకయ్యే ఖర్చులు టీజీ భరత్ చెల్లిస్తారని, అప్పుడు కోర్టులోనే నిజానిజాలు తేలుతాయని సవాల్ విసిరారు. వైసీపీ నాయకులు ఆడిస్తున్న డ్రామాలో కొందరు డబ్బుకోసం బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. టీజీ భరత్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. దళితులకు టీజీ భరత్, ఆయన కుటుంబం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు వివిధ కులసంఘాల నాయకులు నాగరాజు యాదవ్, జనసేన ఇన్‌చార్జి అర్షద్, దాశెట్టి శ్రీనివాసులు, పాల్ రాజు, రాజ్ కుమార్, జూటూరు రవీ, సురేంద్ర, పవన్ సాయి, చినమ్మి, ఈశ్వర్, అనిత, పెంచలయ్య, యేసు, శివ, కన్న, శ్యామ్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పని తీరును పరిశీలించాలి: ఈఆర్ఓ


అధికారులకు సూచనలిస్తున్న ఈఆర్ఓ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 1: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎం యూనిట్ల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలని కర్నూలు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఆదే శించారు. శుక్రవారం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఈవీఎం నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవీఎంలలో తలెత్తే సాంకేతిక లోపాల గురించి డెమోతో వివరించారు. ఈవీఎంల ర్యాండ మైజేషన్ ప్రక్రియను స్పష్టంగా బృందాలకు వివరించారు. పోలింగ్ ప్రక్రియ, ఈవీఎం ఆపరేషన్‌పై పీఓలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దారు మోహన్‌కుమార్, ఎలక్షన్ డీటీ ధనుం జయ, ఈఈ షాకీర్ హుస్సేన్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రత్యేక బృందాలకు శిక్షణ : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, స్టాటిక్ సర్వేయిలన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలకు శుక్రవారం పాత కౌన్సిల్ హాలులో శిక్షణ ఏర్పాటు చేశారు. ఎలక్షన్ సీజర్ మ్యానేజ్‌మెంట్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వైయోలైషన్స్‌పై అడిషనల్ కమి షనర్ పీవీ రామలింగేశ్వర్ వివరించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ మన్సూర్ బాషా ప్రత్యేక బృందాలకు శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాలు/ ఉచిత వస్తువుల డేటాను డిజిటలైజ్ ఎలా చేయాలి.. నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదికలను స్వయంగా ఉత్పత్తి ఎలా చేయాలి, ఏజెన్సీల ద్వారా డూప్లికేట్ డేటా ఎంట్రీలను ఎలా నివారించాలి. ఉన్నతస్థాయి విశ్లేషణ కోసం యాప్స్‌ను ఉపయోగించుకోవాలని మన్సూర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో ప్రజలకు భరోసా

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత


ప్రజలకు టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 1: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు భరోసా కలిగిందని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్ ఆటో స్టాండ్ నుంచి ఆమె బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఎన్నికల్లో ఎలా ఓటు అడగటానికి వస్తున్నారని ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టో, శంఖారావం వివరాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురు షోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కల్లూరు క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న పాల్గొన్నారు.

● **కె.మార్కాపురంలో:** కల్లూరు మండలం కె.మార్కాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో శంఖారావం, బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో ఈరమ్మ, లక్ష్మీదేవి, పుష్పావతి, సుజాత, చిన్న మద్దిలేటి, శేఖర్, రాఘవేంద్ర, పాండు, మాదన్న పాల్గొన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, మార్చి 1: రైతులకు నకిలీ పురుగుల మందులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మలేష్‌కుమార్ దుకాణ యజమానులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లోని పురుగుల మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విక్రయించే ప్రతి పురుగుల మందులకు బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రికార్డులలో నమోదు చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంపీవోలు వెంకటేశ్, సిద్దు ఉన్నారు.

నూతన కమిటీని రద్దు చేయాలి


మాట్లాడుతున్న సండేల్ చంద్రశేఖర్

కర్నూలు(కల్చరల్), మార్చి 1: బ్రాహ్మణ సంఘానికి గురువారం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కొందరు ప్రకటించుకున్నారని, ఆ ఎన్నిక చెల్లదని, నూతన కమిటీని రద్దు చేయాలని కర్నూలు బ్రాహ్మణ ఐక్యవేదిక జేఏసీ నాయకులు అన్నారు. శుక్రవారం బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో పాల్గొన్న పలువురు బ్రాహ్మణ సంఘాల నాయ కులు.. నగర బ్రాహ్మణ సంఘానికి (411/15) నూతన కమిటీ ఎన్నిక జరిగినట్లు చేసిన ప్రకటన చెల్లదని అన్నారు. ఇది ఎన్నికల బైలాకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు రామరాజు, సండేల్ చంద్రశేఖర్, మారుతిశర్మ, కంచుగంటల శ్యామ్‌సుందర్‌రావు, నాగులవరం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగర బ్రాహ్మణ సంఘం ఎన్నిక బైలా ప్రకారం జరిగిందని సంఘం అధ్యక్షుడు కల్లే చంద్రశేఖరశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


వైద్యసేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య

కోడుమూరు(రూరల్), మార్చి 1: దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం వర్కూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య వైద్యసేవలను డీఎంహెచ్‌వో పరిశీలిం చారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు ప్రబలకుండా పంచాయతీ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయించాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన

సి.బెళగల్, మార్చి 1: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు బూత్ లెవల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో ఉండి బ్యాలెట్, వీవీప్యాడులపై పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఈసమావేశంలో ఆదినారా యణ, మణి, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

‘సుందరయ్య కూడలిలో సర్కిల్ ఏర్పాటు చేయాలి’



సంతకాలు సేకరిస్తున్న ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 1: సుందరయ్య కూడలిలో సర్కిల్ ఏర్పాటు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా, డీవైఎఫ్ఐ అధ్వర్యంలో సుందరయ్య జంక్షన్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా అలివేలమ్మ మాట్లాడుతూ కొత్తబస్టాండు, వెంకటరమణకాలనీ, ఆనంద్ థియేటర్ నుంచి వచ్చే వాహనాలతో జంక్షన్ వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. కొన్ని వాహనాలు రాంగ్ రూట్‌లో రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు తక్షణమే స్పందించి జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ న్యూసిటీ కార్యదర్శి ఎస్.హుస్సేన్, కేఎస్.పద్మ, బి.పద్మ, విక్రమ్, వీరేష్ పాల్గొన్నారు.

● భవన నిర్మాణ కార్మికులకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాజాపాషా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు అవసరమైన ఇసుక లేకపోవడంతో జీవనోపాధి లేక 60 మంది చనిపోయారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చకపోతే ఈనెల 4న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కోడుమూరు(రూరల్), మార్చి 1: ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూలు కేంద్రాల్లో పరీక్షలు జరుగు తున్నాయి. శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరిగింది. పరీ క్షలకు ఒక్క నిముషం ఆలస్యం అయినా అనుమతి లేదు. దీంతో ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి సిద్ధపడి రావడానికి నానా తంటాలు పడుతున్నారు. బైక్‌లు, ఆటోలను పట్టుకుని ఎలా గోలా చేరుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కనిముషం నిబంధన తొలగించాలని కోరుతున్నారు. కాగా మొదటిరోజు ప్రభుత్వ జూనియర్ కళాశా లలో 8 మంది, మోడల్ స్కూలు కేంద్రంలో 17 మంది పరీక్షకు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు విజయభాస్కర్, గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఐసీఏఐ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(న్యూసిటీ), మార్చి 1: ఐసీఏఐ (ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా) జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకు న్నారు. నూతన చైర్మన్‌గా సీఏ ఆర్.వీర షణ్ముఖేష్, వైఎస్ చైర్మన్‌గా సీఏ వీ.చంద్రశేఖర్ రాజు, కార్యదర్శిగా ఎన్.భార్గవ్‌కృష్ణ, కోశాధికారిగా కే.ఫణీంద్ర రావు, విద్యార్థి విభాగ చైర్మన్‌గా జి.మహేష్, సభ్యుడిగా జి.సురేంద్రరెడ్డిలను ఎన్నుకున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్ సమావేశ భవనంలో జరిగిన ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఐసీఏఐ దక్షిణా రీజియన్ అధ్యక్షురాలు సీఏ ఏబి.గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ షణ్ముఖేష్ మాట్లాడుతూ సభ్యులు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు సెమినార్‌లు, వర్క్‌షాపులు, విద్యార్థుల కు ఐటీటీ ఓరియేంటేషన్ ప్రొగ్రామ్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు ప్రసన్నకుమార్, శ్రీనివాస్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ళ సుబ్బారావు, సునీల్‌కుమార్ మండవ, ఎక్స్ అఫిషియో సభ్యులు చంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైల పాదయాత్ర భక్తుల సేవలో..


భక్తులకు అన్నదానం చేస్తున్న దేవగిరి వాసులు

కోడుమూరు(రూరల్), మార్చి 1: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల పాదయాత్ర భక్తులకు ప్యాలకుర్తి సాయిసేవాశ్రమం వద్ద అన్నదానం చేపట్టారు. అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలోని దేవగిరి గ్రామ వాసులు తమ సేవలను కొనసా గిస్తున్నారు. ఉదయానే అల్పాహారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అన్నదానం చేస్తున్నారు. అంతేకాకుండా పాదయాత్రలో ఆరోగ్యపరంగా ఇబ్బందుల పడే భక్తుల కోసం కడుపునొప్పి, ఒళ్లునొప్పులు, జ్వరం, విరేచనాల వంటి ఇబ్బందలకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకె ట్లు, బొబ్బలకు ఆయింట్‌మెంట్, బ్యాగులకు రేడియం స్టిక్కర్లు అందు బాటులో ఉంచారు. కోడుమూరుకు చెందిన ఓ భక్తుడు అరటిపండ్లు అంది స్తున్నారు.

అన్నదానం


బాటసారులకు ఆహార పొట్లాలను ఇస్తున్న విద్యార్థి డేవిడ్

కర్నూలు(కల్చరల్), మార్చి 1: నగరంలోని షరీన్‌నగర్‌కు చెందిన జి. డేవిడ్ ఇంజనీరింగ్ విద్యార్థి శుక్రవారం అన్నదానం చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో, కొత్త బస్టాండు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వాటిని పేదలకు, రోడ్డు వెంట వెళ్లే నిరుపేద బాటసారులకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈసందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకో వాలన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, ఎస్తేరమ్మ, విజయకుమార్ విజయభారతి, తోటి మిత్రులు పాల్గొన్నారు.

‘బీజేపీని బలోపేతం చేయండి’


మాట్లాడుతున్న నగరూరు రాఘవేంద్ర

కర్నూలు(కల్చరల్), మార్చి 1: జిల్లాలో బీజేపీని బలోపేతం చేయాలని, తమ పార్టీ చేపట్టిన ప్రజాపోరు-2 కార్యక్రమం విజయవంతం అయిందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరిచామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మో ర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళినాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి గోరంట్ల రామాంజినేయులు, లోకేశ్వరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, మార్చి 1: మండలంలోని పలుకుదొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ తిమ్మారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలంతా కలిసి మెలసి జీవించాలన్నారు. గ్రామ పంచాయతీలలో అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఎర్పాటు చేశామన్నారు. ఎస్ఐ వెంట హెడ్ కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

డోన్‌కు తరలిన టీడీపీ శ్రేణులు



కోడుమూరు, గూడూరు నుంచి డోన్‌కు బయలుదేరిన టీడీపీ నాయకులు

కోడుమూరు(రూరల్), మార్చి 1: డోన్‌లో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి ఆత్మీయ సభకు కోడుమూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని క్రిష్ణాపురం, అనుగొండ, వెంకట గిరి, గోరంట్ల, ప్యాలకుర్తి తదితర గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు వాహనాలలో బయల్దేరి వెళ్లారు. అంజన్‌రెడ్డి, హనుమంతు, సురేష్, నాగేంద్ర, షేక్షావలి, తిరుమలనాయుడు, బంకు గిడ్డయ్య, పరమేశ్వరనాయుడు, వెంకటేశ్వర్లు యాదవ్, రాఘవేంద్ర యాదవ్, నారాయణ పాల్గొన్నారు.

సి.బెళగల్: డోన్‌లో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి ఆత్మీయ సభకు మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈసందర్భంగా మాజీ జడ్పీటీసీ చిన్న మునెప్ప మాట్లాడుతూ రానున్న స్థానికల ఎన్నికల నేపథ్యంలో ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలన్నారు. డోన్‌కు తరలివెళ్లిన వారిలో టీడీపీ నాయకులు, రాజు, అడివప్ప, మండల ఉపాధ్యక్షులు నాగరాజు, దుబ్బన్న, వెంకటేశ్వర్లు ఉన్నారు.

గూడూరు: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరులో చరణ్ కుమార్ ఆధ్వర్యంలో డోన్‌లో టీడీపీ విస్తృత స్థాయి ఆత్మీయ సభకు టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చరణ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.


సి.బెళగల్ నుంచి డోన్‌కు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

సున్నా చుట్టేశారు..!





జగనన్నా ఇదేం అన్యాయం అంటున్న రైతులు

- సాధ్యం కాని నిబంధనలతో సున్నా వడ్డీకి తూట్లు
- పంట రుణాలపై రైతులే ముందుగా వడ్డీ చెల్లించాలి
- ఆ తర్వాత ఏడాదికి ప్రభుత్వం తిరిగి చెల్లింపు
- 2023 ఖరీఫ్ వడ్డీని ఎప్పుడు చెల్లిస్తారో తెలియని రైతులు



ఈ రైతు పేరు రాముడు. వెల్దుర్తి మండలం కొసరాపల్లికి చెందిన ఈ రైతు తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నాడు. పంట సాగు కోసం వెల్దుర్తిలోని రాయలసీమ గ్రామీణ బ్యాంకులో ఏటా రుణం తీసుకునే వాడు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ రైతు తీసుకున్న పంట రుణానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లించింది. పంట అమ్మిన తర్వాత రైతు బ్యాంకులో అప్పు తీర్చాడు. టీడీపీ అధికారంలోంచి పోయి వైసీపీ వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ రైతు మొదటే వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. ముందు రైతు వడ్డీ చెల్లిస్తే ఆ తర్వాత ప్రభుత్వం బ్యాంకులో రైతు ఖాతాకు జమ చేస్తుందని జీవోను 2019 చేసింది. దీంతో ఈ రైతు గత నాలుగు సంవత్సరాలుగా సున్నా వడ్డీ తనకు అందుతుందో లేదోనని ఆందోళన చెందాల్సి వచ్చింది. రెండు రోజుల క్రిందట ప్రభుత్వం విడుదల చేసిన సున్నా వడ్డీ తన బ్యాంకు ఖాతాకు జమ అయిందో లేదోనని రాయలసీమ గ్రామీణ బ్యాంకులో ఆరా తీస్తున్నాడు. అయితే.. ఇంకా నిధులు జమ కాలేదని బ్యాంకు అధికారులు చెప్పారు. రాముడు అనుభవించిన ఇబ్బందిని కర్నూలు, నంద్యాల జిల్లాలోని నాలుగున్నర లక్షల మంది రైతులు ఎదుర్కొంటున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 1: కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 6 లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. వీరు కొద్దిపాటి పంట దిగుబడికైనా గిట్టుబాటు ధర అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. పంట సాగు కోసం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 5 లక్షల మంది రైతులు కర్నూలు జిల్లాలో పంట రుణాలను వివిధ బ్యాంకుల్లో తీసుకుంటున్నారు. రూ. లక్షలోపు పంట రుణం తీసుకున్న రైతుల తరఫున 7 శాతం వడ్డీని అంటే.. రూ.7వేలను ప్రభుత్వమే చెల్లించే వెసులుబాటు గత టీడీపీ ప్రభుత్వం కల్పించింది. రైతులు మార్చిలోగా అసలు చెల్లిస్తే సరిపోయేది. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ పథకం అమలులో సాధ్యంకానీ నిబంధనలను పెట్టారు. రెండు రోజుల కింద సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు ఆఫీసు నుంచి సున్నా వడ్డీ కింద 2021-22 రబీ సీజన్, 2022-23 ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులకు సున్నా వడ్డీ పథకానికి అర్హులైన రైతులకు రీయంబర్స్‌మెంటు చేస్తూ అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే.. ఉమ్మడి జిల్లాలో కేవలం పంట రుణాలు తీసుకున్న నాలుగున్నర లక్షల మంది రైతులకు గాను కేవలం 10 శాతం మంది రైతులకే అంటే.. 1.30 లక్షల మంది రైతులను మాత్రమే సున్నా వడ్డీ పథకానికి అర్హులుగా తేల్చారు. దీంతో మిగిలిన మూడున్నర లక్షల మంది రైతులుసున్నావడ్డీ కోసం వ్యవసాయ శాఖ కార్యాలయాలకు, బ్యాంకులకు పరుగులు తీశారు. కర్నూలు జిల్లాలో 2021-22, 2022-23 సంవత్సరం ఖరీఫ్‌లో 76,831 మంది రైతులకు మాత్రమే రూ.18.21 కోట్ల సున్నావడ్డీ నిధులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో కేవలం 54,376 మంది రైతులకు మాత్రం రూ.11.08 కోట్లును రైతులకు విడుదల చేశారు. వాస్తవంగా రెండు జిల్లాల్లో నాలుగున్నర లక్షల మంది రైతులు దాదాపు ఖరీఫ్, రబీ సీజన్లలో 6 లక్షల దాకా పంట రుణాలు తీసుకున్నారు. అనవసర నిబంధనలు లేకుంటే అర్హులందరికీ న్యాయం జరిగేది. నాలుగున్నర లక్షల మందికి సున్నా వడ్డీ పథకం అమలయ్యేది.

సాధ్యం కానీ నిబంధనలతో సున్నా వడ్డీకి తూట్లు

వైసీపీ ప్రభుత్వం సాధ్యం కాని నిబంధనలు విధించడంతో అర్హులైన రైతులు సున్నా వడ్డీ పథకానికి అనర్హులయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగున్నరలక్షల మంది ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాలను తీసుకుంటున్నారు. రైతులు పంట రుణాలు తీసుకున్న తర్వాత ఆ పంట సీజన్ ముగిసిన తర్వాత మార్చిలోగా వడ్డీని చెల్లిస్తేనే సున్నా వడ్డీ పథకానికి అర్హులవుతారు. ఆ తర్వాత ఏడాది తర్వాత నింపాదిగా ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులను జమ చేస్తోంది. రైతులు పంట రుణం తీసుకునే సమయంలో బ్యాంకులో ఏ పంటను సాగు చేసినట్లు చూపుతారో.. అదే పంట పొలంలో ఉండాలి. ఈ మేరకు ఈక్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించాల్సిందే. లేకపోతే రైతులు పంట రుణంపై వడ్డీని చెల్లించినా ప్రభుత్వం మాత్రం సున్నా వడ్డీని రైతులకు జమ చేయదు. ఈ విధానాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021-22 రబీ సీజన్‌తో పాటు 2022-23 ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రెండు రోజుల క్రితం ప్రభుత్వం సున్నా వడ్డీ నిధులను జమ చేసింది.

2023లో తీసుకున్న పంట రుణాలకు వడ్డీ చెల్లించాలని రైతులపై ఒత్తిడి

2023లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. ఈ రైతులంతా మార్చి నెలాఖరులోగా వడ్డీ చెల్లించాలని, లేకపోతే అసలుతో కలిపి చక్రవడ్డీని వసూలు చేస్తామంటూ బ్యాంకు అధికారులు అంటున్నారు. అసలే పంటలు లేక నష్టాల పాలై జీవనోపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్న తమపై ఏమాత్రం కనికరం లేకుండా వెంటనే వడ్డీ చెల్లించాలని బ్యాంకులు ఒత్తిడి చేస్తే.. తాము ఎక్కడి నుంచి కట్టాలని ప్రశ్నిస్తున్నారు.



ఇదీ చాలా దారుణం

ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆశించిన స్థాయిలో పంట చేతికందలేదు. పెట్టుబడి కూడా వస్తుందో రాదో తెలియడం లేదు. దీంతో పంట సాగు కోసం తీసుకున్న రుణాన్ని చెల్లించలేకపోతున్నాను. ఈ పరిస్థితుల్లో ఆ రుణంపై వడ్డీని మార్చి నెలాఖరులోగా చెల్లించాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అప్పులపాలైన మేము మళ్లీ అప్పులు చేసి వడ్డీ ఎట్లా కట్టాలి?

-మాణిక్యం, రైతు, పుట్లూరు, క్రిష్ణగిరి

అర్హులందరికీ సున్నావడ్డీ పథకం అమలైంది



ఐదో ఏడాది మూడో విడతగా కర్నూలు జిల్లాలో సున్నా వడ్డీ పథకం కింద 36,831 మంది రైతుల ఖాతాలకు రూ.18.21 కోట్లును జమ చేశాం. అర్హులైన రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేశాం. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ

రూ.3.16 కోట్లతో గురు నివాస్ భవనం



రూ.3.16 కోట్లతో నిర్మాణంలో ఉన్న గురు నివాస్ మందిరం

మంత్రాలయం, మార్చి 1: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వెనుకాల తుంగభద్ర నది ఒడ్డున బెంగళూరుకు చెందిన అశ్వర్థనారాయణ అనే భక్తుడు రూ.3.16 కోట్లతో గురునివాస్ భవన నిర్మాణం పనులు చేపట్టారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. మఠం ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ పర్యవేక్షణలో కాంట్రాక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ శ్రీనివాసులు పర్యవేక్షణలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన వివిధ మఠాధిపతులకు నివాసాలు ఉండే విధంగా రెండు గదులు, వారి మఠం సాంప్రదాయాల ప్రకారం నిర్వహించే రెండు పూజా మందిరాలు వారి శిష్యులకు ఆరు గదులు, ప్రత్యేకమైన వంట గదులను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో మొదటి, రెండు అంతస్థులుగా ఆధునికీరణ, సుందరీకరణ, తులసివనం, నది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ భవనాన్ని రూపొందిస్తున్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: డీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 1: మార్చి 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ అన్నారు. శుక్రవారం ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో పది పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, అడిషినల్ సూపరింటెండెంట్లకు పరీక్షలపై వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు, చూచి రాతలకు తావివ్వరాదన్నారు. పరీక్ష కేంద్రాల్లో పొరపాట్లు జరిగితే అందుకు సంబంధించిన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు గీత, ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్, డీసీఈబీ సెక్రటరీ నాగరాజు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు అడిషినల్ చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కదిలిన ఉపాధి అధికారులు

ఆంధ్రజ్యోతి కథనంతో క్షేత్ర స్థాయి పరిశీలన



ఆరేకల్లులో ఉపాధి కూలీలు పనిచేసే చోట విచారణ చేస్తున్న అధికారులు

ఆదోని రూరల్, మార్చి 1: ఉపాధి హామీ అధికారులు పొలాల బాట పట్టారు. 'నిధులు దోచేశాడు' అనే కథనానికి స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీడీ లోకేశ్, ఏపీఓ ఖాలిక్ అబ్దుల్ శుక్రవారం 10గంటల కల్లా ఆరేకల్లుకు చేరుకున్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు, విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, వైసీపీ కాంట్రాక్టర్ రామిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్ సమక్షంలో ఉపాధి అధికారులు పొలంబాట పట్టారు. పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి విచారణ చేశారు. ముందుగానే వైసీపీ నాయకులు కూలీలకు ట్రైనింగ్ ఇవ్వడంతో ఆ ప్రకారమే అధికారులకు సమాధనం ఇచ్చుకుంటూ పోయారు.

ఎండు మిర్చి ధర పతనం

క్వింటం గరిష్ఠంగా రూ.12,800



విక్రయానికి వచ్చిన ఎండు మిర్చి బస్తాలు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 1: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధరలు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. గతవారంతో పోల్చితే ధరలు సగానికి దిగజారాయి. ఎండుమిర్చి సింజెంటా రకం క్వింటం అధికంగా రూ.12,800 పలికింది. ధర పతనం కావడంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి సాగుకు ఎకరానికి రూ.వేల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. బ్యాడిగి రకం మిర్చి క్వింటాలు కనిష్ఠ ధర రూ.5,600, గరిష్ఠ ధర రూ.12,269, సిజెన్టా రకం మిర్చి క్వింటాలు కనిష్ఠంగా రూ.5,506, గరిష్ఠంగా రూ.12,800, 5531 రకం మిర్చి క్వింటాలు కనిష్ఠంగా రూ.5,401, గరిష్ఠంగా రూ.10,200, సూపర్ టెన్ రకం గరిష్ఠంగా రూ.11,569 పలికింది.

రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డి


రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి. శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌యూ జేఏసీ చైర్మన్

కర్నూలు(అర్బన్), మార్చి 1: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాయలసీమకు న్యాయ రాజధాని ఇస్తానని చెప్పి నయవంచన చేశాడని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బీ. శ్రీరాములు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. కేంద్రం అనుమతి లేకుండా కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయానికి ఏ విధంగా భూమి పూజ చేస్తారని నిలదీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప రాయలసీమ కరువు సమస్య తీరదని, రాయలసీమలో పరిశ్రమలు కావాలంటే చంద్రబాబు మరో సారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ నెల 12న కర్నూలు నగరంలో రాయలసీమలోని నిరుద్యోగులు, విద్యావంతులతో రాయలసీమ గర్జన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సురేంద్ర, రాజు, భరత్, రవి, సాయి, సోము, చందు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్ ఏవోగా ఎం.శ్రీనివాసులు



ఏవోకు అభినందనలు తెలుపుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 1: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏవోగా ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు నర్సింగ్ కాలేజీలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయనకు మూడు రోజుల క్రితం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విజయవాడలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయనకు ఏవోగా పదోన్నతి కల్పించి కర్నూలు జీజీహెచ్‌లో పోస్టింగ్ వేశారు. ఈ మేరకు కొత్త ఏవో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఆఫీసు సూపరింటెండెంట్లు కుమారస్వామి, లతీఫ్, సీనియర్ అసిస్టెంట్లు చిరంజీవి, రాజశేఖర్, నాగజయంతి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

- అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ
- దాదాపు గంటన్నరపాటు ఆగిపోయిన వాహనాలు

ఆత్మకూరు రూరల్, మార్చి 1: ఆత్మకూరు మండలంలోని కర్నూలు గుంటూరు జాతీయ రహదారిలోని రోళ్లపెంట ఘాట్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం ఓ లారీ అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీ కొన్నది. దీని వల్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆత్మకూరు నుండి శ్రీశైలానికి ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును, దోర్నాల నుంచి ఆత్మకూరు వైపుగా వస్తున్న ఓ లారీ అదుపు తప్పి రోళ్ల పెంట ఘాట్ రోడ్డులోని ఓ మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డుకు అడ్డంగా లారీ నిలబడి పోవడంతో కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై రోళ్లపెంట వద్ద దాదాపు గంటన్నరపాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎస్‌ఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలం చేరుకుని ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును, లారీని ప్రయాణికుల సహాయంతో పక్కకు జరిపి రోడ్డును క్లియర్ చేశారు. కాగా గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, చీరాల, ఒంగోలు, మార్కాపురం, వైజాక్, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్ళే బస్సులు, వివిధ వాహనాలు ఆగిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



ట్రాఫిక్ జామ్ కావడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

బనగానపల్లె, మార్చి 1: బనగానపల్లె పట్టణంలోని కొండపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జానకిని సస్పెండ్ చేసినట్లు ఎంఈవో స్వరూప శుక్రవారం తెలిపారు. ఈ మేరకు చేస్తూ రీజనల్ జాయింట్ డైరక్టర్ ఉత్తర్వులు జరీ చేసినట్టు వెల్లడించారు. బనగానపల్లె పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులతో హెచ్‌ఎం జానకి తన ఇంటిలో పనిచేయించు కుంటున్నట్లు ఆరోప ణలు రావడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.నాగరాజును హెచ్‌ఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

ఆటోను ఢీకొన్న కారు..

ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలు

ఆదోని రూరల్, మార్చి 1 : ఆదోని మండలం పెద్దతుంబళం శివారులోని జైన్ దేవాలయం వద్ద ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొంది. దీంతో ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దతుంబళం నుంచి ఆటోలో శాంతమ్మ, బల్లేకల్లుకు చెందిన రామయ్యతోపాటు పలువురు ఆదోనికి బయల్దేరారు. గ్రామ శివార్లలోకి చేరుకోగానే ఆదోని నుంచి మాధవరం వెళ్తున్న కారు టైరు పంక్చర్ అయి ఆటోను ఢీకొట్టింది. దీంతో శాంతమ్మ, రామయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. రామయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లారు. కారు డ్రైవర్ పాండును అదుపులో తీసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు.. వాహనం సీజ్, ఒకరు పరార్

మంత్రాలయం, మార్చి 1: మండలంలోని మాధవరం సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున పరమాన్‌దొడ్డి తండాకు చెందిన సుగాలి రమేష్ నాయక్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తుండగా మాధవరం ఎస్‌ఐ క్రిష్ణమూర్తి పట్టుకున్నారు. శుక్రవారం తుంగభద్ర నది నుంచి తరలిస్తున్న 15 బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నది ఒడ్డు నుంచి పాత టాటా ఏసీ ట్రాలీ వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా.. దాడులు చేసి పట్టుకున్నారు. ఇందులో డ్రైవర్ బోయ లేపాక్షిని అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టుకు తరలించగా.. మద్యం ఉన్న సుగాలి రమేష్ నాయక్ పరారిలో ఉన్నాడు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ బందెనవాజ్, హెడ్ కానిస్టేబుల్ వీరేష్, వీరాంజనేయులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

4న సీఎం సార్ వస్తున్నారు...

ఆదివారం బడి పెట్టుకోండి

- సోమవారం సెలవు తీసుకోండి
- ప్రైవేటు యాజమాన్యానికి డీఈవో సందేశం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 1 : నంద్యాల జిల్లా బనగానపల్లెకు ఈనెల 4వ తేదీన సీఎం వస్తున్నారు. అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు 3వ తేదీన ఆదివారం పాఠశాలలు నడపాలని, 4వ తేదీ సోమవారం సెలవు తీసుకోవాలని, ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు పాఠశాలల వాహనాలను తమకు హ్యాండోవర్ చేయాలని నంద్యాల డీఈవో సందేశం పంపారు. డీఈవో సందేశంపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తలలు పట్టుకుంటున్నారు. ఇటీవలే అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభకు వందల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలల వాహనాలను సభకు పంపించామని, మళ్లీ ఇప్పుడు ఇదేం తతంగమంటూ పెదవి విరుస్తున్నారు. దీనిపై విద్యార్థి, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. విద్యాశాఖాధికారై ఉండి ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 1: జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆయా ఆదర్శ పాఠశాలలో 5వ తరగతి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు మార్చి 2 నుంచి 31వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి రుసుము చెల్లించాలన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ఆలూరు, మార్చి 1: ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోగా అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవరావ్ శుక్రవారం కోరారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలన్నారు. వచ్చే నెల 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో 2023-2024 విద్య సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు.

శివస్వాములకు అల్పాహారం

ఆదోని టౌన్, మార్చి 1: శ్రీశైలం మల్లికార్జుస్వామిని దర్శించుకోవడం కోసం పాదయాత్రగా వెళ్లే భక్తులకు గంగపుత్ర రాష్ట్ర నాయకుడు, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం అల్పాహారాన్ని అందజేశారు. జంగమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాము, వెంకటరాముడు, మద్దికెర రామకృష్ణ, యండీ బద్రీనాథ్ స్వామి, నెట్టేకల్ రవీంద్ర సింగ్, జయరాం సింగ్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్

ఆదోని టౌన్, మార్చి 1: ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా రామచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రఘునాథరెడ్డి ప్రొద్దుటూరు మున్సిపాలిటీకు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామచంద్రారెడ్డి బాపట్ల నుంచి వచ్చారు. బాధ్యతలు తీసుకొన్న వెంటనే పట్టణ సమస్యలపై ఆయన దృష్టిని సారించారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఇన్‌చార్జి ఎంఈ వెంకటచలపతి, సిబ్బందితో కలిసి ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తాం



రూ.50వేల నగదును అందిస్తున్న దివాకర్ రెడ్డి

కౌతాళం, మార్చి 1: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి అన్నారు. రౌడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత మారికాంబ దేవి దేవాలయాన్ని శుక్రవారం గ్రామ ప్రజలు, భక్తుల సమక్షంలో ప్రారంభించారు.

● గ్రామంలో నూతన ఆలయ నిర్మాణానికి తిక్కారెడ్డి రూ.50వేలు అందించారని, ఈ నగదును శుక్రవారం మండల నాయకులతో కలిసి దివాకర్ రెడ్డి గ్రామ పెద్దలకు, ఆలయ పెద్దలకు అందజేశారు. వీరి వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు సంఘం రాష్ట్ర జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, నాయకులు సిద్దు, రాజాబాబు, పుగ్గినాగ, భీమయ్య, వీరేష్, జట్టప్ప, ఈరన్న ఉన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, మార్చి 1: ఉత్తరప్రదేశ్‌లోని సిలైబార్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకున్న సందర్భంలో జరిగిన ఘర్షణలో సురేష్ అనే విద్యార్థిన్ని కాల్చి చంపిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రాజు, నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడుబూరులో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, అంజినప్ప, రాజన్న, లాజర్, జోషప్ పాల్గొన్నారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, మార్చి 1: వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా చేశారు. శుక్రవారం మాఘ షష్ఠి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు.

శ్రీమఠానికి నిత్యావసర సరుకులు విరాళం

మంత్రాలయం, మార్చి 1: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎమ్మిగనూరు చెందిన ఆనంద్ ట్రేడర్స్ వంద కేజీల బాస్మతి బియ్యం, వేయి కేజీల ఉప్పు, వంద కేజీల బఠానిలు, పది కేజీల బాదం, వంద కేజీల తెల్లనూగులు, పది కేజీల నల్లనూగులు, 30 కేజీల నువ్వుల నూనె విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతిచార్ తెలిపారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో వంటకు సంబంధించిన నిత్యావసర సరుకులు టెండరును నిర్వహించారు. దాదాపు ఆంధ్ర, కర్ణాటకకు చెందిన 15 మంది వ్యాపారులు టెండరులో పాల్గొని ఆయా వస్తువులను శ్రీమఠానికి ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. అదే విధంగా కర్ణాటకలోని ఇరువూరు గ్రామానికి చెందిన నాగభూషణం వంద కేజీల కుంకుమ, బెంగుళూరు చెందిన రవికుమార్ 500 కేజీల ఉప్పు, 30 కేజీల నువ్వుల నూనె విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఆదోనికి చెందిన గురురాజా ట్రేడర్స్ 500 కేజీల ఉప్పు, సిరిగుప్పకు చెందిన నాగరాజు 100 కేజీల డాల్డా విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ టెండరులో జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, స్టోర్ ఇన్‌చార్జి రవికులకర్ణి, సూపరింటెండెంట్ అనంతపురానిక్, నారాయణరావు పాల్గొన్నారు.

వినూత్న బోధనతో విద్యార్థులను ఆకట్టుకోవాలి

● సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



క్రాంతినగర్ పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న సబ్ కలెక్టర్

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 1: వినూత్నమైన బోధనతో విద్యార్థులను ఆకట్టుకున్నప్పుడే వారికి చదువుపై ఆసక్తి కలుగుతుందని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని క్రాంతినగర్ పురపాలక ప్రాథమిక పాఠశాలను, కేజీబీవీ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయుడిగా మారి పాఠ్యపుస్తకలను పట్టుకొని, అందులోని ప్రశ్నలను విద్యార్థులను అడిగారు మధ్యాహ్న భోజనాన్ని తిని భోజన నాణ్యతను పరిశీలించారు. కేజీబీవీలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

పాత పెన్షన్ ఇచ్చే వారికే మా ఓట్లు

గోనెగండ్ల, మార్చి 1: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఏ రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో హామీ ఇస్తారో వారికే తమ ఓట్లు అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో ఉన్నత పాఠశాలలో ఆ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు వారంలోపు సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పి అయిదేళ్లు పూర్తయినా రద్దు చేయలేదని, దాని స్థానంలో జీపీఎస్‌ను అమలు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు హేమంత్, నరసింహులు, మద్దిలేటి, చంద్రపాల్, అక్బర్, బాబు, సలీమ్, లింగన్న, నాగేశ్వరరావు, రజని, దుర్గ, తాజుద్దీన్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



ర్యాలీగా వస్తున్న కార్యకర్తలు

జగన్ ఓటమి ఖాయం

● అన్ని వర్గాల ప్రజలు అదే కోరుకుంటున్నారు
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు
● ఎమ్మిగనూరులో టీడీపీ శ్రేణుల సమావేశం

ఎమ్మిగనూరు, మార్చి 1: సీఎం జగన్ దిగిపోవాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆశిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా నీలకంఠేశ్వర స్వామి ఆలయం, ఎంబీ చర్చి, పెద్ద మసీదులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం సోమప్ప సర్కిల్‌కు చేరుకొని సోమప్ప విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి వందలాదిగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో బీటీ నాయుడు మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారని, ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు మొదలుకొని అన్ని రకాల ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. ఐదేళ్లలో అసమర్థపాలన సాగించారని, దీంతోనే అన్ని వర్గాల ప్రజలు జగన్ పోవాలని, చంద్రబాబు రావాలని కోరుకుంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్ని విన్యాసాలు చేసినా ఆయనకు అడ్డుకట్ట వేసేది బీవీ జయనాగేశ్వరరెడ్డి మాత్రమేనన్నారు.



మాట్లాడుతున్న బీటీ నాయుడు



మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

చంద్రబాబును సీఎం చేద్దాం : బీవీ జయనాగేశ్వర రెడ్డి

జరగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి.. చంద్రబాబును సీఎంగా చేద్దామని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఐదేళ్లలో అన్ని వర్గాల ప్రజల ఆశలపై సీఎం జగన్ నీళ్లు చల్లాడన్నారు. మద్య నిషేధం చేయకుంటే ఓట్లే అడగనని చెప్పిన జగన్ నేడు ఏముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. గతంలో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టిన సీఎం జగన్ నేడు కులాల మధ్య చిచ్చు పెడుతూ ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను తెచ్చిన జీడీపీ పైపులైన్, ఆర్డీఎస్ కుడి కాలువ, టెక్స్‌టైల్ పార్కు వంటివి వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రీ టెండర్ పేరుతో పక్కనపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడ్, టీడీపీ కౌన్సిలర్లు రామదాసు గౌడ్, వీజీఏ దయాసాగర్, ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సుందరరాజు, చేనేత మల్లి, మాజీ కౌన్సిలర్లు ముల్లా కలీముల్లా, రంగస్వామి గౌడ్, రామకృష్ణ నాయుడు, సలీం, సలాం, మండల అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి ఈరన్న, మాజీ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, మాజీ ఎంపీపీ శంకరయ్య, నాయకులు చిన్నరాముడు, నాగరాజు గౌడ్, మాధవరావు దేశాయ్, కాశీం వలి, వెంకటరామిరెడ్డి, బండెగురుస్వామి, గురురాజు, నజీర్ అహ్మద్, రమేష్ నాయుడు, కృష్ణంనాయుడు, తిరుపతయ్య నాయుడు, ఎన్వీ రామాంజనేయులు, బడేసాబ్, రంగస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరక బండిలాగుడు పందెం పోటీలు

కోసిగి, మార్చి 1: కోసిగి శ్రీరేణుకా ఎల్లమ్మ రథోత్సవం సందర్భంగా కోసిగిలోని బుగేనిచెరువు సమీపంలో మండల స్థాయి గిరక బండిలాగుడు పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఆర్గనైజర్లు శ్రీరాములు, వీరేష్, లక్ష్మిరెడ్డి, రాజు నరసింహులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సం ఖ్యలో ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.21వేలు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మురళీరెడ్డి, రెండో బహుమతి రూ.15 వేలు కోసిగి మేజర్ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, మూడో బహుమతి రూ.10 వేలు రైతు మాన్వి ఈరన్న, నాలుగో బహుమతి రూ.5వేలు నాడిగేని నాగరాజులు గెలుపొందిన విజేతలకు అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సతీష్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కొత్తపేటలో రాతిదూలం పోటీలు

దేవనకొండ, మార్చి 1: మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవం సందర్భంగా కొత్తపేట గ్రామంలో రాతిదులం పోటీలు గ్రామస్తులు జరిపారు. పోటీలలో 9 జట్లు పాల్గొన్నాయి. ఒంగోలు జిల్లా ముంగనూరు వృషభాలు ప్రథమ, నాగర్‌కర్నూలు ద్వితీయ, నంద్యాల జిల్లా పగిద్యాల తృతీయ విజేతలు పోటీలలో గెలుపొందాయి.

దాతల ఔదార్యం



ద్వారాలకు ఏర్పాటు చేసిన తొడుగు

తుగ్గలి, మార్చి 1: మల్లికార్జున స్వామి ఆలయానికి ధ్వజస్తంభం, ద్వారాలకు కవచాలు ఏర్పాటు చేసినట్లు దాతలు ఈడిగ రాముడు, టీడీపీ నాయకులు కదిరప్ప, హెడ్ కానిస్టేబుల్ కేపీ రంగస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని బొందిమడుగులలో మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.2 లక్షలతో ఈడిగ రాముడు ధ్వజస్తంభం ఏర్పాటు చేయగా.. హెడ్‌కానిస్టేబుల్ కేపీ రంగస్వామి రూ.లక్షతో ఆలయ ద్వారాలకు ఇత్తడి పూత వేసిన కవచాలను వేయించారు. అనంతరం మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సర్పంచ్ చౌడప్ప, ప్రతాప్ యాదవ్, సీపీఐ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నందవరం, మార్చి 1: ఎమ్మిగనూరులో టీడీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎంపీటీసీ జగ్గాపురం నరసింహులు, బాపురం రాఘవరెడ్డి, బద్రినీలకంఠ కోరారు. వారు మాట్లాడుతూ చంద్రబాబును సీఎం అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని, అందరూ కలిసికట్టుగా పని చేసి ఎమ్మిగనూరులో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

14న న్యాక్ బృందం రాక

పత్తికొండ టౌన్, మార్చి 1: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం 14న రానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మాధురి తెలిపారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1980 సంవత్సరంలో పత్తికొండ డిగ్రీ కళాశాల ఏర్పాటైందని, ఆ సంవత్సరం నుంచి నేటి వరకు కళా శాల అభివృద్ధి చెందుతూ వస్తుందన్నారు. కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు కూడా సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు. సమావేశంలో కళాశాల న్యాక్ కోఆర్డినేటర్ డా.పవన్ కుమార్, అధ్యాపకులు హనుమంతురెడ్డి, రామక్రిష్ణ, వీరాం జనేయులు, శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డుకు ఐఏఎస్ అధికారిని నియమించాలి



అభివాదం తెలుపుతున్న ముస్లింలు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 1: వక్ఫ్ బోర్డుకు ఐఏఎస్ అధికారిని నియమించాలని ముస్లిం రైట్ ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహబూబ్ అన్నారు.. గురువారం రాత్రి ఆదోని పట్టణంలోని షాహి జామియా మసీద్ వెనుక మసూదియా ఉన్నత పాఠశాల మైదానంలో ముస్లింల మహా గర్జన బహిరంగ సభ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎఫ్ జిల్లా ట్రెజరర్ ఖాద్రి సాహెబ్, ముక్తి అబ్దుల్ రెహ్మాన్, రోషన్ అలీ, బాబు సాబ్, అబ్దుల్ సాహెబ్, సయ్యద్ ముర్తుజా ఖాద్రి, పెద్ద మసీదు ప్రధాన ట్రస్ట్ సౌదీ రావుఫ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 1: మండలంలోని కలుగొట్ల గ్రామంలో శుక్రవారం కాశీ ఈశ్వరస్వామి ఆలయంలో వివిధ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. శుక్రవారం బ్రహ్మశ్రీ వేదపండితులు గుండు వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో రెండు రోజులపాటు పూజలు చేశారు. అలాగే శివపార్వతులకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, కందనాతి చెన్నారెడ్డిలు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే రామలింగడు, కొండన్నగౌడు, వెంకటరెడ్డి, ఈడిగ రాముడు, లంకహనుమంతు, నరసన్నగౌడు, సోమేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాములతో పాటు గ్రామస్థులు మూడు రోజులుగా ఉపవాసదీక్షను పాటించారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

● పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 1: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి ఏడాది లాంగ్వేజ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి చేరుకున్నారు. పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించమని ఇంటర్ బోర్డు ముందుగానే చెప్పడంతో సకాలంలో చేరుకున్నారు. కొంత మంది విద్యార్థులు ఆలస్యంగా వచ్చినా, పరుగులు పెట్టారు. ఆదోని పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాలలో ఏ సెంటర్లో 337 మంది విద్యార్థులకు గాను 15 మంది, బీ సెంటర్లో 357 మంది గాను 9 మంది, బాలాజీ కాలేజీలో 334 మంది విద్యార్థులు గాను 9 మంది, సాయి కళాశాలలో 386 మంది గాను 12 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 376 మంది గాను 9 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2,589 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 82 మంది గైహాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మెడికల్ సిబ్బందిని నియమించారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 వరకు మొదటి రోజు మొదటి ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 244 మంది విద్యార్థులకు గాను 236 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సురేష్ తెలిపారు.

ఆలూరు: మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలలో 244కు గాను 230 మంది హాజరు కాగా, మోడల్ స్కూల్లో 195కు గాను 188 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, రాఘవరావ్ తెలిపారు.

మంత్రాలయం: మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 191మంది విద్యార్థులకు గాను183 మంది విద్యార్థులు హాజరు కాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఆస్పరి: ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 189 విద్యార్థులకు గాను, 181 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహులు తెలిపారు.

కోసిగి: కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలలో రెండు సెంటర్లలో 254 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 143 మంది మాత్రమే హాజరయ్యారు. 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవో రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరులోని ఏడు పరీక్షా కేంద్రాల్లో 2400మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆదోనిలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



కోసిగిలో నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఎమ్మిగనూరు: పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

● జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న డీఈవో

మద్దికెర, మార్చి 1: పదో తరగతి పరీక్షలు భయం వీడి ఇష్టపడి రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ అన్నారు. శుక్రవారం మద్దికెరలోని ఆదర్శ పాఠశాలలో తనిఖీ చేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. ప్రతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం మంచి నీటి వసతితో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రంగస్వామి, ప్రిన్సిపాల్ కరణం సవిత, వార్డెన్ ఉషారాణి తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రీషియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర, మార్చి 1: మద్దికెర పంచాయితీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ బండారు సుహాసిని, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ మద్దికెర పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తిగల యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చాం

మద్దికెర, మార్చి 1: మండలంలో పేదలందరికీ పార్టీలకతీతంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశామని ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక డీపీఏపీ కమ్యూనిటీ హాలులో రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, ఆర్ఐ రవికుమార్, మైనార్టీ నాయకులు ఆకుల ఖాజావలి, వీఆర్వోలు ఉన్నారు.

పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

మద్దికెర, మార్చి 1: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను వైసీపీ మాజీ మంత్రులు, నాయకులు విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మండల జనసేన పార్టీ నాయకులు గద్దల రాజు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సీఎం జగన్ తమ నాయకుడు పవన్ కళ్యాణ్‌ను నాలుగు పెళ్లిల్లు అన్నారని, ఆయన వ్యక్తిగత జీవితంలోకి వెళ్లడం జగన్ తప్పు కాదా అని ప్రశ్నించారు. జగన్ భజన బృందంతో పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయలేదా అన్నారు. గుట్కా నాని, పేర్ని నాని, రోజాలు తమ అధినేత పవన్‌కళ్యాణ్‌పై మాట్లాడే హక్కు లేదన్నారు.

కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటాం



చెన్న వీరయ్య స్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 1: టీడీపీ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మఠం చెన్నవీరయ్య స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, శివరామిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సాయి కుమార్ రెడ్డి, ఉమాకాంత్ రెడ్డి, వీరారెడ్డి, నవకోటి నారాయణ, పైబావి నర్సారెడ్డి, బెన్సర్, కురువ కృష్ణ, చిదానంద, సూగయ్య స్వామి, అదే విధంగా జంగం వీరన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో టీడీపీ కార్యకర్త పోతుల తిక్కస్వామి మృతి చెందడంపై టీడీపీ కార్యకర్త తిక్కస్వామి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన పోతుల తిక్కస్వామి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట జ్ఞానేష్, అయ్యన్న, వక్రాణి వెంకటేష్, కొండగేని వీరారెడ్డి, భరద్వాజశెట్టిలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అలాగే టీడీపీ బీసీ నాయకులు ఉలిగయ్య రామకృష్ణారెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి తిక్కస్వామికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంకాళమ్మ, బంగారమ్మ దేవాలయ ఆర్చీకి విరాళం



అంకాళమ్మ, బంగారమ్మ దేవాలయ ఆర్చీకి కలశాలను అందిస్తున్న దృశ్యం

పత్తికొండ, మార్చి 1 : పత్తికొండ పట్టణ గ్రామదేవతలు అంకాళమ్మ, బంగారమ్మ దేవాలయానికి సంబంధించి నూతనంగా నిర్మించిన ఆర్చీకి కొండేగరికి చెందిన కురువ రామాంజినేయులు నూతన కలశాలను విరాళంగా అందించారు. రూ.40వేల విలువ చేసే కలశాలను శుక్రవారం ఇంటినుండి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయంలో పూజల అనంతరం నూతనంగా నిర్మించిన ఆర్చీపైభాగంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎల్లారెడ్డి, తుప్పటి నాగన్న, విలేకరి పక్కీరప్ప ఉన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

మద్దికెర, మార్చి 1: మండలంలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన న్యూకేటగిరి బండలాగుడు పోటీలను శుక్రవారం ఎస్ఐ రమేష్‌బాబు ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుహతి రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆకుల ఓబులేసు, ఆకుల వేణుగోపాల్, నంది జయరాముడు, మధుబాబు, మల్లికార్జున, ఆంజనేయ, వడ్డె మోహన్ పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తుగ్గలి, మార్చి 1: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ షర్మిళ, వైద్యులు ప్రవీణ్ కుమార్, హరిత అన్నారు. శుక్రవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. పిల్లల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డీటీ నిజాముద్దీన్, ఎంఈవో రమావెంకటేశ్‌గౌడు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ అంబికా ఉన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపాలి

దేవనకొండ, మార్చి 1: వచ్చే ఎన్నికలలో వైసీపీని ఇంటికి సాగనంపాలని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ బాబు అన్నారు. దేవనకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా పేదల సంక్షేమం కోసం ప్రతినెల కుటుంబానికి రూ.5 వేలు ఇస్తామన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వైసీపీని ఓడించాలని ప్రజలను కోరారు.